సీఎం కేసీఆర్‌ను కలిసిన వెంకటేష్



అబిడ్స్: సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు బండారి వెంకటేష్ కలిశారు. ఇటీవల టీడీపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ..రాష్ట్ర నలుమూలలా బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు తమ ముదిరాజ్ కులస్తులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ముదిరాజ్‌లంతా ఏకమై బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ దేశంలో నెంబర్–1 స్థానానికి చేరిందన్నారు.

కార్వాన్‌లో బీజేపీ హవా



ప్రచారంలో బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ఈసారి విజయం సాధిస్తానని ఆ పార్టీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. సోమవారం ఆయన కార్వాన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు బస్తీల్లో పాదయాత్ర చేస్తూ ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. అవినీతికి చిరునామా ముఖ్యమంత్రి కేసీఆర్ అని, ఈసారి ఎన్నికల్లో ప్రజలు ఆయనను తిరస్కరిస్తారని అమర్‌సింగ్ అన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సునీల్‌యాదవ్, యోగ్‌రాజ్‌సింగ్, గోవర్ధన్ తదితరులున్నారు.

అభివృద్ధి కావాలంటే బీజేపీని గెలిపించాలి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రారావు

చార్మినార్: పాతబస్తీలో అభివృద్ధి నిరోధకులుగా మారిన మజ్లిస్ పార్టీకి ఓటు ద్వారా గట్టిగా బుద్ధి చెప్పి ఓడించే సమయం ఆసన్నమైందని బీజేపీ మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రారావు అన్నారు. దశాబ్దాలుగా పాతబస్తీలో తిష్ట వేసిన మజ్లిస్ పార్టీని ఓడించి తమను గెలిపించాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘారాణి ఘాన్సీబజార్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీ అభివృద్ధి కావాలంటే బీజేపీని గెలిపించాలన్నారు. బీజేపీ నాయకులు పాండుయాదవ్, పాశం సురేందర్ ఎం.కుమార్, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, పవన్ మిశ్రా, నరేష్ అవస్థీ తదితరులు పాల్గొన్నారు.

'కార్వాన్‌లో హ్యాట్రిక్ సాధిస్తాం'



ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్ నసీరుద్దీన్ తదితరులు

గోల్కొండ: కార్వాన్‌లో మజ్లిస్ వరుసగా 3వ సారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ఆ పార్టీ నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ, నానల్‌నగర్, టోలిచౌకీ పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కంటే మజ్లిస అభ్యర్థి కౌసర్ మొహియుద్దీన్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు బదర్ ఉద్దీన్, హారూన్ ఫరాన్, వజీ ఉజ్ జమా, అబ్దుల్ సలాం తదితరులున్నారు.


రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం



ప్రచారంలో శేఖర్‌రెడ్డి తదితరులు

గోల్కొండ: రాష్ట్రంలో ఈసారి కూడా బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కార్వాన్ నియోజకవర్గం సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు శేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ లాంటి సెక్యులర్ సీఎం దేశంలో మరెవరు లేరన్నారు. బీజేపీకి రెండు అంకెలకు మించి సీట్లు రావని, బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ఆ పార్టీ ప్రకటించడం హాస్యాస్పదం అని ఆయన అన్నారు. అనంతరం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పోటీ చేస్తున్న సనత్‌నగర్‌కు తరలివెళ్లారు.

నామినేషన్ దాఖలు చేసిన బోనాల శ్రీనివాస్



రిటర్నింగ్ అధికారి విక్టర్‌కు నామినేషన్ దాఖలు చేస్తున్న శ్రీనివాస్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థిగా బోనాల శ్రీనివాస్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అబిడ్స్ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఆర్.ఓ.కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వి.విక్టర్‌కు ఆయన నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం బోనాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను చిత్తుగా ఓడించి ప్రజా ఏక్తాపార్టీ జెండా ఎగరవేస్తానన్నారు. ప్రజలంతా తనవైపే ఉన్నారని పేర్కొన్నారు. అదేవిధంగా గోషామహల్ నియోజకవర్గంలో సోమవారం మరో ఇద్దరు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

'ప్రజలు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవచ్చు'



మాట్లాడుతున్న డీసీపీ షేక్ జహంగీర్

గౌలిపురా: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవచ్చునని దక్షిణ మండలం అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్ తెలిపారు. ఎన్నికలను పురస్కరించుకొని భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఆయన మీర్‌చౌక్, ఛత్రినాక ఏసీపీలు వెంకటేశ్వర్ రావు, రమేష్, భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సైలు, సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్ మాట్లాడుతూ.. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకారం అందించాలన్నారు. ఎన్నికల సమయంలో ఎవరూ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దీపావళికి తుమిడీలతో లక్ష్మీదేవికి ఆహ్వానం

- మార్కెట్లో తుమిడీలు రెడీ
- ఉత్తర భారతీయుల ప్రత్యేకత
- తుమిడీలలో 150 రకాలు





ఘాన్సీబజార్‌లో అమ్మకానికి సిద్ధంగా తుమిడీలు

చార్మినార్: దీపావళిని పురస్కరించుకుని మార్కెట్లోకి తుమిడీలు వచ్చేశాయి. వాస్తవానికి నెల రోజుల ముందు నుంచే మార్కెట్‌లో తుమిడీల క్రయవిక్రయాలు కొనసాగుతాయి. హైదరాబాద్ నగరంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న అగర్వాల్, మార్వాడీలు దీపావళి పండుగను 'తుమిడీ'లతో జరుపుకోవడం సంప్రదాయం. అగర్వాల్ కుటుంబీకులు తమ ఆచార వ్యవహారాలకు..సంస్కృతికి అద్దం పట్టే తుమిడీలను దీపావళి సందర్భంగా అత్తగారింట్లోని తమ కూమార్తెలకు ప్రత్యేక కానుకగా అందజేస్తారు. పూలు, పండ్లు, స్వీట్స్‌లతో పాటు ఈ తుమిడీలను అత్తవారింటికి తీసుకువెళ్లి తమ కుమార్తెలకు అందజేయడం ఆనవాయితీ. దీంతో దీపావళి పండుగకు ముందుగానే తుమిడీలు మార్కెట్లోకి వస్తాయి. ప్రస్తుతం పాతబస్తీలో తుమిడీల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. నగరంలోని ఇతర ప్రాంతాల వారు సైతం పాతబస్తీకి వచ్చి తుమిడీలను ఖరీదు చేస్తున్నారు.

తుమిడీలలో 150 రకాలు..

తుమిడీలలో 150 రకాలున్నాయి. ఒక్కో తుమిడి అడుగు నుంచి 15 అడుగుల పొడవు ఉంటాయి. రూ. 100 నుంచి రూ.21 వేల వరకు వీటి ఖరీదుంటుంది. తుమిడీలను రంగు రంగుల ఫర్నీలతో పాటు బట్టలతో తయారు చేస్తారు. ప్రత్యేకంగా తయారు చేసే తుమిడీల కోసం ముందుగానే ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుంది. గుజరాత్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలతో పాటు హైదరాబాద్ నగరంలోని అగర్వాల్ కుటుంబీకులు వీటిని తప్పనిసరిగా సంప్రదాయబద్ధంగా వినియోగిస్తారు.

రద్దీగా మారిన ఘాన్సీబజార్..

తుమిడీల క్రయవిక్రయాలతో ఘాన్సీబజార్ రద్దీగా మారింది. అగర్వాల్ కుటుంబీకులు ఎక్కువగా నివసించే ఘాన్సీబజార్ పరిసర ప్రాంతాల్లో ఈ తుమిడీల తయారు ఎక్కువగా ఉంటుంది. ఇంట్లో ఏర్పాటు చేసే ఈ తుమిడీలలో దీపాలు వెలిగిస్తారు. దీపాంతలలో నూనే పోసి దూది ఒత్తులతో తుమిడీలలో దీపాలు వెలిగిస్తారు. ఇవి రాత్రంతా దేదీప్యమానంగా వెలుగులు విరజిమ్ముతాయి.

ఆకర్షణీయంగా తయారు చేస్తాం..



తుమిడీల ఏర్పాటుతో ఇంటికి లక్ష్మీ దేవిని ఆహ్వానించినట్లుగా భావిస్తాం. దీపావళి పండుగకు పది రోజుల ముందుగానే ఈ తుమిడీలను కానుకలుగా అందజేస్తారు. తమకు వియ్యంకుల కుటుంబీకుల పట్ల ఉన్న ప్రేమానురాగాలకు నిదర్శనంగా ఈ తుమిడీలను అందజేయడం జరుగుతుంది. దీపావళి పండుగకు నెల రోజులకు ముందు నుంచే తుమిడీలను తయారు చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచుతాం. తుమిడీలను వివిధ రూపాల్లో రంగురంగుల ఫర్నీలు, విద్యుత్ బల్బులు, క్లాత్‌లతో ఆకర్షణీయంగా తయారు చేస్తాం. – రాజేందర్ కుమార్ అగర్వాల్, తయారీదారుడు

సర్టిఫికెట్ కోర్సుల వార్షిక ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఆచార్య కిషన్ రావు

నాంపల్లి: తెలంగాణలోని 13 ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలోని అంశాలకు సంబంధించి డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల వార్షిక ఫలితాలను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు సోమవారం విడుదల చేశారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలల్లో జులై 2023 నెలలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షల ఫలితాలను ఆయా కళాశాలలకు పంపించడం జరిగిందని వర్సిటీ పరీక్షల విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ నర్సింహమూర్తి ఒక ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థులు తమ పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని ఆయన తెలిపారు.

'లక్షకుపైగా మెజార్టీతో ప్రజలు ఆశీర్వదిస్తారు'



నామినేషన్ వేస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్

లంగర్‌హౌస్: అభివృద్ధిని చూసి అన్ని వర్గాల వారు తనకు మద్దతు తెలుపుతున్నారని, లక్షకుపైగా మెజార్టీతో గెలిపించి నన్ను ఆశీర్వదిస్తారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గం ఎంఐఎం పార్టీ అభ్యర్థిగా సోమవారం గోల్కొండ తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. ఆర్‌ఓ కొమరయ్యకు నామినేషన్ పత్రాలు అందించారు. సోమవారం వరకు కేవలం ఒకే ఒక నామినేషన్ అది కూడా ఎమ్మెల్యే కౌసర్ నామినేషన్ అందుకున్నామని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా టోలీచౌకీ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఎమ్మెల్యే తరలివచ్చారు. నామినేషన్ అనంతరం ఎమ్మెల్యే కౌసర్ మాట్లాడుతూ.. ప్రతిబస్తీ, ప్రతి వీధిల్లో అడిగినా, అడగకున్నా తన బాధ్యతగా అడుగడుగునా అభివృద్ధి పనులు చేశానన్నారు.

'నగరంలో బీజేపీ అభ్యర్థులకు విజయావకాశాలు ఎక్కువ'



చార్మినార్: నగరంలో బీజేపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించనున్న విషయాన్ని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌కు వివరించినట్లు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఇన్‌చార్జి జీవన్.జీ తెలిపారు. తరుణ్ చుగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నగరంలో పార్టీ పరిస్థితిని వివరించినట్లు ఆయన తెలిపారు. ఈసారి హైదరాబాద్ సెంట్రల్ జిల్లాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తున్నారనే విషయం తరుణ్ చుగ్‌కు తెలిపానన్నారు.

టీపీజీఎల్ విజేత కె మోటార్స్–ఆర్య వారియర్స్



టీపీజీఎల్ విన్నర్స్, రన్నరప్

గోల్కొండ: శ్రీనిధి యూనివర్సిటీ 3వ తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ విజేతగా కె మోటార్స్–ఆర్య వారియర్స్ నిలిచారు. సోమవారం గోల్కొండ నయాఖిలాలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో జరిగిన ఫైనల్స్‌లో ఆర్య వారియర్స్ జట్టు టీఎఫ్‌ను ఓడించింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్స్‌లో ఒక్కొక్క అంచెలో ఒక్కొక్కరు పైచేయిని సాధించుకుంటూ మందుకు సాగారు. 2, 3వ మ్యాచ్‌లు సమంగా ముగిశాయి. చివరికి అత్యుత్తమ గోల్ఫ్‌తో కె మోటార్స్ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ ట్రోఫీని ఎగురేసుకుపోయింది. ఇంతటి ఉల్లాసభరితమైన వాతావరణంలో జరుగుతున్న బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం తనకు మరుపురాని అనుభూతులు ఇస్తాయని ప్రముఖ నటి మధుషాలిని అన్నారు. తెలంగాణ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్‌కు ఆతిథ్యమివ్వడం తమకెంతో గర్వకారణమని హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్ ఠాకూర్ అన్నారు. ఇటువంటి టోర్నమెంట్‌కు తాము స్పాన్సర్‌గా వ్యవహరించడం తమ సంస్థకే గర్వకారణమని ఎడ్యుకేషన్ గ్రూప్స్ చైర్మన్ డా. కటికనేని తాహెర్‌మహి అన్నారు. కాగా టోర్నమెంట్ నిర్వహణకు హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ వారు చక్కని సహకారం అందిస్తున్నారని ఆయన అన్నారు.

ఏఐఎంఐఎం నాంపల్లి అభ్యర్థి నామినేషన్ దాఖలు



ఆర్‌ఓకు పత్రాన్ని అందజేస్తున్న మహ్మద్ మాజిద్ హుస్సేన్

నాంపల్లి: నియోజకవర్గంలో సోమవారం ఒకే ఒక నామినేషన్ దాఖలైంది. ఏఐఎంఐఎం అభ్యర్థి మహ్మద్ మాజిద్ హుస్సేన్ ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. అయితే పార్టీ బీ–ఫారం అందజేయలేదు. ఏఐఎంఐఎం అభ్యర్థి మహ్మద్ మాజిద్ పేరిట స్థిరాస్తులు రూ.1,04,48,500 అతని భార్య సయిదా జువేరియా అజ్మత్ పేరిట స్థిరాస్తులు రూ.3,50,000 ఉన్నాయి. అలాగే చరాస్తులు రూ.92,10,200 అతని భార్య పేరిట రూ.51,61,408 ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన చేతిలో నగదు రూ.28,89,679, భార్య చేతిలో నగదు రూ.23,36,141 ఉన్నట్లు పేర్కొన్నారు. కెనరా బ్యాంకు బంజారాహిల్స్ శాఖలో తన పేరిట బ్యాంకు బ్యాలెన్స్ రూ.20,267, భార్య ఖాతాలో రూ.20,267 బ్యాలెన్స్ ఉన్నట్లు చూపారు. అతడి పేరిట రెండు కార్లు, ఒక గన్ ఉన్నాయి. అదే విధంగా మహ్మద్ మాజిద్ హుస్సేన్ పేరిట రూ.14,33,000 అప్పులు, రెంటల్ డిపాజిట్స్ రూ.3,90,000 ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించి, బెదిరించిన ఘటనలో బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో 353, 506 రెడ్‌విత్ 34 ఐపీసీ కింద అతడిపై కేసు నమోదై ఉంది.

బీజేపీ ఇంటింటి ప్రచారం



కార్వాన్ బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్‌కు హారతులు పడుతున్న దృశ్యం

జియాగూడ: ఇంటింటికి వెళ్లి కార్వాన్ బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరినట్లు గోవా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సదానంద్ సేట్ సర్వాడే అన్నారు. సోమవారం జియాగూడ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో జియాగూడలోని మరిగి మాత ఆలయంలో డోర్‌బస్తీ, ఇమాంపురా, సంజయ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి అమర్‌సింగ్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

'గుట్ట' బీజేపీ టికెట్ ముదిరాజ్‌లకే కేటాయించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గం బీజేపీ టికెట్‌ను ముదిరాజ్ కులస్థులకే కేటాయించాలని ఉప్పుగూడ ముదిరాజ్ సహకార సంఘం చైర్మన్ రుద్రారం అంజయ్య ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. ఉప్పుగూడలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లడుతూ.. బీజేపీ పార్టీ కులస్థులకు సముచిత న్యాయం కల్పిస్తూ ఊరడి సత్యనారాయణ ముదిరాజ్‌కు సీటు కేటాయించిందని.. కాని అనారోగ్యం సమస్యలతో ఆయన పోటీ చేయడం లేదని పార్టీకి లేఖ రాశారన్నారు. ఆయన స్థానంలో నియోజకవర్గానికి చెందిన 1988 నుంచి పార్టీ కోసం పని చేస్తున్న బర్ల శ్రీనివాస్ ముదిరాజ్‌కు సీటు ఇవ్వాలన్నారు. నరహరి, శ్రీమన్నారాయణ, దేవేందర్, సుధాకర్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'యాకుత్‌పురా ప్రజలకు అందుబాటులో ఉంటా'



నామినేషన్‌ను అందజేస్తున్న జాఫర్ హుస్సేన్ మేరాజ్

చార్మినార్: తనపై ఎంతో నమ్మకంతో యాకుత్‌పురా టికెట్ కేటాయించిన అసదుద్దీన్ ఒవైసీతో పాటు అక్బరుద్దీన్ ఒవైసీలకు యాకుత్‌పురా మజ్లిస్ పార్టీ అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మేరాజ్ ధన్యవాదాలు తెలిపారు. యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మేరాజ్ నామినేషన్ దాఖలు చేయగా.. విద్యార్థుల రాజకీయ పార్టీ తరఫున అనీల్‌కుమార్ తన నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా జాఫర్ హుస్సేన్ మేరాజ్ మాట్లాడుతూ.. యాకుత్‌పురా ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. చార్మినార్, బహదూర్‌పురా నుంచి ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు.

ప్రజా సేవకే జీవితం అంకితం



నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను సత్కరించిన బీఆర్‌ఎస్ నాయకులు ధన్‌రాజ్

అబిడ్స్: ప్రజా సేవకే జీవితం అంకితమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ఆయన జన్మదిన వేడుకలు సోమవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ బీఆర్‌ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్ ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బిలాల్ మాట్లాడుతూ..నియోజకవర్గ అభివృద్ధికి, నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగేష్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బాలసాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత మాచిరాజు కామేశ్వర్‌రావుకు కథల చందమామ బిరుదును సోమవారం రవీంద్ర భారతిలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జేపీ పబ్లికేషన్ ముద్రించిన దేశసేవ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. చిన్నారుల కోసం కామేశ్వర్‌రావు రాసిన పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతాయని కొనియాడారు. బాలసాహిత్య పరిషత్ అధ్యక్షులు చొక్కాపు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి దాసరి వెంకటరమణ, కెనరాబ్యాంక్ విశ్రాంత ఏజీఎం ఎన్ వీ.చారి తదితరులు పాల్గొన్నారు.



కామేశ్వర్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఎల్లూరి శివారెడ్డి తదితరులు

విశ్వరూప మహా సభను జయప్రదం చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సత్యనారాయణ తదితరులు

జియాగూడ: ఈనెల 11న నగరంలో జరిగే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని జియాగూడ ఇమాంపురా నవభారత్ సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ అన్నారు. సోమవారం ఎన్‌బీఎస్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు మిర్యాల నవీన్, చంద్రమోహన్‌తో కలిసి బ్రోచర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తలపెట్టిన మహాసభకు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. జస్వంత్ కుమార్, మహేష్‌బాబు, వినయ్‌కుమార్, కిరణ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపే



బీ–ఫారం అందుకుంటున్న పులిపాటి రాజేశ్‌కుమార్

చార్మినార్: ఈసారి జరిగే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని బహదూర్‌పురా శాసన సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్ కుమార్ అన్నారు. సోమవారం గాంధీభవన్ నుంచి పార్టీ జారీ చేసిన బీ–ఫారంను ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఈనెల 9న పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి తన నామినేషన్‌ను దాఖలు చేయనున్నానన్నారు.

'గుట్ట'లో రెండు నామినేషన్లు దాఖలు



ఆర్వోకు నామినేషన్ ఫారాలను అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బోయ నరేష్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో సోమవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్ర, శని వారాల్లో ఎలాంటి నామినేషన్లు వేయడానికి అభ్యర్థులు ముందుకు రానప్పటికీ.. సోమవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి ముప్పిడి సీతారాం రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి బోయ నరేష్ తమ నామినేషన్ ఫారాలను రిటర్నింగ్ అధికారి సూర్యప్రకాష్‌కు అందజేశారు. నామినేషన్ల సందర్భంగా ఫలక్‌నుమాలోని బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం వద్ద చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్‌కుమార్ పర్యవేక్షణలో గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఉరి వేసుకొని యువకుడి మృతి

జియాగూడ: అల్లం వెల్లుల్లి తయారీ కేంద్రంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇమాంపురాకు చెందిన సి. ప్రేమ్(18) డోర్ బస్తీ మర్గీ మాత ఆలయ ప్రాంతంలో అల్లం వెల్లుల్లి తయారీ కేంద్రం గోడౌన్‌లో పనిచేస్తున్నాడు. గోడౌన్‌లో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కాటన్ క్లాత్‌తో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ప్రేమ్‌స్నేహితులు ధీరజ్, రాహుల్ వెంటనే ప్రేమ్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుని మామ రూపేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'అనురాగ్ సింగ్‌ఠాకూర్ మతి భ్రమించింది'



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్లు ముఖేష్ సింగ్, పరమేశ్వరీసింగ్

అబిడ్స్: కేంద్రమంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్‌కు మతిభ్రమించి సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు ముఖేష్ సింగ్, పరమేశ్వరీ సింగ్ పేర్కొన్నారు. ధూల్‌పేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టారన్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని, కేసీఆర్‌ను పలుమార్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా మెచ్చుకున్నారని పేర్కొన్నారు. రాజాసింగ్ నామినేషన్ ర్యాలీకి వచ్చిన కేంద్రమంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ దిగజారుడు వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. పదేళ్లుగా గోషామహల్‌లో ఎమ్మెల్యే రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లోధ్ సమాజ్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వ పథకాలతోనే బీఆర్‌ఎస్‌లో చేరికలు



నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రగతితోనే పలు పార్టీల వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అన్నారు. గోషామహల్ రోడ్డులోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బేగంబజార్, మంగళ్‌హాట్ డివిజన్లకు చెందిన దాదాపు 100 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నందకిశోర్‌వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. పదేళ్లుగా మంత్రి తలసాని సహకారంతోనే గోషాహమహల్‌లో అభివృద్ధి జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలంతా బీఆర్‌ఎస్‌వైపే మొగ్గుచూపుతున్నారని నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూజవ్యాస్ బిలాల్, కోటి శైలేష్ కురుమ, ప్రదీప్‌రాజ్, అనిత, పుష్ప, సంతోషి తదితరులు పాల్గొన్నారు.